విశాలాంధ్ర విశాఖపట్నం
సోమవారం 15, డిసెంబర్ 2025

ఏయూలో నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మహిళల స్వయం సాధికారతను సాధించేలా, ఆర్థిక బలోపేతాన్ని పెంచేలా, స్వయం ఉపాధిని ప్రోత్సహించే విధంగా 12 రోజుల పాటు నిర్వహించతలపెట్టిన సరస్ ఎగ్జిబిషన్ సోమవారం నుంచి ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శన 2025 డిసెంబర్ 15 నుంచి 26వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామమని తెలిపారు. వండగల సమయం, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటం, మెరుగైన రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు విస్తృతంగా ఉండటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆదాయ వనరులను పెంపొందించడం, గ్రామీణ మహిళల జీవనోపాధిని బలోపేతం చేయడం ఈ ప్రదర్శన యొక్క ప్రధాన ఉద్దేశమని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

600 మంది ఎస్.హెచ్.జి. సభ్యుల ఆధ్వర్యంలో 250 స్టాళ్లు ఏర్పాటు

ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ఎస్.హెచ్.జి. మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 250 స్టాళ్లలో హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, మసాలాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు తదితర నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని వివరించారు. దీని ద్వారా విశాఖవాసులకు దేశంలోని వివిధ రాష్ట్రాల నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరలకు ఒకేచోట లభించనున్నాయని పేర్కొన్నారు. అదనంగా ఫుడ్ స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల వినోద ఆటపరికరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జీవీఎంసీకి మూడు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ గ్రోత్, ప్రిజెర్వింగ్ రూట్స్ ది పీఆర్ విజన్ ఫర్ 2047 అనే థీమ్‌తో ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో డిసెంబర్ 13 నుంచి 15 వరకు నిర్వహించిన 47వ అఖిల భారత పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ 2025లో మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మూడు ప్రతిష్టాత్మక పి.ఆర్.ఎస్.ఐ - 2025 జాతీయ అవార్డులు సాధించిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. డిసెంబర్ 13వ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి ప్రారంభోత్సవం చేయగా డిసెంబర్ 14వ తేదీన అవార్డుల ప్రధానోత్సవం ఉత్తరాఖండ్ శాసనసభ గౌరవనీయ స్పీకర్ రీతూ ఖండూరీ భూషణ్, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమేష్ పోక్రియల్ నిశాంక్, పి.ఆర్.ఎస్.ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్ పాతక్ చేతుల మీదుగా జీవీఎంసీకి ఈ జాతీయ అవార్డులు అందజేయబడ్డాయని కమిషనర్ తెలిపారు. విశాఖపట్నం నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిల్ సభ్యులు అందించిన నిరంతర సహకారం, భాగస్వామ్యం, ప్రోత్సాహంతో జీవీఎంసీ అమలు చేసిన ప్రజా సంక్షేమం, మహిళల సాధికారత, అభ్యున్నతి, మహిళల ఆర్థిక బలోపేతం,సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా అవగాహన, ప్రచార, సామాజిక మాధ్యమ కార్యక్రమాలు, బాల్యం విద్యా కేంద్రాలలో బాలల ఆరోగ్యం, విద్య,భద్రత, పోషణ, సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలకు గానూ జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు లభించిందని కమిషనర్ తెలిపారు. బాల్యం విద్యా కేంద్రాలలో బాలల ఆరోగ్యం, విద్య,భద్రత, పోషణ,సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాల అమలుకు గాను బెస్ట్ సి.ఎస్.ఆర్ ప్రాజెక్ట్ ఫర్ చైల్డ్ కేర్ ప్రథమ స్థానం, నగరంలో ప్రజలకు అందిస్తున్న నగర సేవలు, పాలన, ప్రజా అవగాహన కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా సమర్థవంతంగా ప్రజలకు చేరవేసినందుకు గాను బెస్ట్ యూజ్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ ఎ కార్పొరేట్ క్యాంపెయిన్, - ప్రథమస్థానం, మహిళల సాధికారత,సామాజిక, ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి, సామర్థ్య వృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు అమలు చేసినందుకు ద్వితీయ స్థానం లభించినట్టు తెలిపారు. ఈ అవార్డులను జీవీఎంసీ తరపున జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణ మూర్తి, పౌర సంబంధాల అధికారి ఎన్.నాగేశ్వరరావు అందుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో, ప్రజా అవసరాలను కేంద్రంగా చేసుకుని జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలకు లభించిన గౌరవంగా ఈ అవార్డులను భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ప్రజలతో బలమైన కమ్యూనికేషన్‌తోపాటు సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు జీవీఎంసీ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న శ్రీలీల

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని సినీనటి శ్రీలీల దర్శించుకున్నారు. తొలుత ఈమె కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ పర్యవేక్షణాధికారి శ్రీనివాస్ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రకృతితో జీవితమే హిందూ జీవన విధానం

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రకృతితో మమేకమైన జీవన విధానమే భారతీయ జీవన విధానమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ఆంధ్ర ప్రాంతం బౌద్ధిక్ ప్రముఖ కొండపల్లి రామారావు తెలిపారు. ఆదివారం వేములవలస సంఘ మండలం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ మేరకు వక్తలు మాట్లాడుతూ సనాతన ధర్మం భారతీయుల జీవన విధానమని హిందుత్వం అంటే మతం కాదని అదొక జీవన విధానం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల వృత్తులకు చెందిన వ్యక్తులను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ చైతన్య ఆశ్రమం యోగాచార్యుడు అప్పల నాయుడు, ఆర్ఎస్ఎస్ విశాఖ జిల్లా సహ కార్యవాహ తమ్మిన నర్సింగ్‌రావు, వేములవలస సంఘ మండలం సంగచాలక్ ఉమామహేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు బాలి రవిశంకర్, బంటుపల్లి శంకర్మరుపిల్ల సురేష్, ఆకుల అభి, కొండు మురళి, దొంతలు ఉదయ్, కోరుకొండ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - మల్కాపురం: హిందూస్తాన్ షిప్ యార్డ్ 1984 - 85 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు అపూర్వ కలయిక ఘనంగా నిర్వహించి ఆటపాటలతో గడిపారు. విద్య నేర్పించిన గురువులను సత్కరించారు. ఆటపాటలలో అందరికి బహుమతులు అందించి మరుపురాని జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు.

కార్పొరేటర్‌ను పరామర్శించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర - మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం పరిధి 58వ కార్పొరేటర్ గులిగిందాల లావణ్యని, వార్డ్ అధ్యక్షులు గులిగిందాల కృష్ణని ఆదివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కోటమూరి సతీష్, వైసీపీ గాజువాక పరిశీలకులు మాజీ శాసనసభ్యులు తైనాల విజయ్ కుమార్ పరామర్శించారు.

వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి సన్నిధిలో వైభవంగా ఆర్జిత సేవలు జరిగాయి. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ స్వామివారికి 108 బంగారు సంపెంగలతో అత్యంత వైభవంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం ఆర్జిత సేవలు జరిగాయి. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కళ్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేసి వేద మంత్రాలు, నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ తులసీదళార్చన, నిత్య కళ్యాణం, గరుడ సేవలు వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయ దాతలకు వేద ఆశీర్వాదం, శేష వస్త్రాలు అందజేసి, పెరుమాళ్ అంతరాలయ దర్శనాలు అధికారులు కల్పించారు.



విశాఖ బీచ్ రోడ్‌లో నేవీ మారథాన్ ఉత్సాహంగా సాగింది. నేవీ మారథాన్‌లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో యువత తరలివచ్చారు. దీంతో బీచ్‌రోడ్డు అంతా సందడిగా మారింది. మారథాన్ సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
(విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం)

పీఏసీసీ శిథిల భవనాన్ని పున:నిర్మించండి

విశాలాంధ్ర - గాజువాక: శిధిలమైన లంకెలపాలెం పీఏసీఎస్ క్రొత్త భవనాన్ని పున:నిర్మించాలని డీసీసీబీ చైర్మన్ తాతారావుకి కూటమి నాయకులు వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉమ్మడి జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్, లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ అధ్యక్షులు కోన తాతారావుని ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి కూటమి నాయకులు కలిసి లంకెలపాలెం పీఏసీసీ ఆవిర్భవించి ఏడున్నర దశాబ్దాలు జరుగుతుందని, అప్పటినుండి రైతులకు మెరుగైన సేవలు అందిస్తుందని వివరించారు. కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రస్తుతం అద్దె ఇంట్లో కొనసాగిస్తున్నారన్నారు. కావున కొత్త భవనం నిర్మించాలని కోరారు. 1999 సంవత్సరంలో సుమారు 350 మంది సొసైటీ సభ్యులు వేల రూపాయలు చొప్పున గ్యాస్ పంటను తీసుకోవడం జరిగిందన్నారు. సభ్యులు ఆర్థిక పరిస్థితి బాగులేనందున గ్యాస్ బండ రుణము తీర్చలేకపోవడంతో నేటికీ సభ్యుడికి 40 వేల రూపాయలు వడ్డీతో కట్టవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. కావున గ్యాస్ బండ రుణాలు మాఫీ చేయవలసిందిగా కోరుతున్నట్లు తెలిపారు. లంకెలపాలెం సొసైటీకి త్రీమెన్ కమిటీని వేసి చాలా రోజులైనప్పటికీ ఎటువంటి కార్యక్రమం చెయ్యకపోవడం సభ్యులకి నూతన కమిటీని పరిచయ కార్యక్రమం కూడా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని త్వరలో చేయవలసిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు. అగనంపూడి సీనియర్ టిడిపి నాయకులు ఉరిటి అప్పలరాజు, జనసేన నాయకులు సాలాపు అచ్చిబాబు, పట్టా పైడి రత్నం పాల్గొన్నారు.

రాష్ట్ర నాగవంశీయుల వన భోజన మహోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: జీవీఎంసీ 2వ వార్డ్ రాజుల తాళ్లవలస, లెజెండ్ వెనుక లుంబిని పార్క్‌లో ఆదివారం రాష్ట్ర నాగవంశీయు వన భోజనాల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నాగవంశ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు హాజరయ్యారు. వైసీపీ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు, టీడీపీ యువ నాయకులు గంటా రవి తేజ, జీవీఎంసీ రెండవ వార్డ్ కార్పొరేటర్ గాడు చిన్న కుమారి లక్ష్మి, గాడు అప్పలనాయుడు పాల్గొన్నారు. సుమారు 5,000 మంది విజయవాడ, రాజమండ్రి, విజయ నగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, సాలూరు ప్రాంతాల నుంచి వచ్చి సరదాగా గడిపారు.

నేడు వైసీపీ కోటి సంతకాల ర్యాలీ

డిప్యూటీ మేయర్ సతీష్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఉత్తర నియోజవర్గం 46వ వార్డు పరిధి అధ్యక్షులు బలిరెడ్డి గోవిందరాజు ఆధ్వర్యంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు సంయుక్తంగా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. శాంతినగర్ ఆఫీసులో పార్టీ ఆదేశాల మేరకు డిసెంబర్ 15వ తేదీన జరగబోయే సంతకాల సేకరణకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి మద్దిలపాలెం జంక్షన్ వరకు ప్రజలచేత సంతకాల సేకరణ చేసిన పత్రాలను, బాక్సులుగా తయారుచేసి ప్రచార రథంలో పెట్టి ర్యాలీ చేపడతామన్నారు. 46వ వార్డు నుండి కైలాసపురం జంక్షన్ వద్ద ఉదయం 9 గంటలకు వార్డ్‌లో ఉన్న బూత్ కన్వీనర్లు, వార్డు కమిటీ, మహిళా కమిటీ కార్యకర్తలు పాల్గొని, కైలాసపురం జంక్షన్ నుంచి కలిసికట్టుగా జీవీఎంసీ విగ్రహం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు బలిరెడ్డి గోవిందరాజు, వార్డు పరిశీలకులు ఎంవి.రాఘవులు, కె.చిన్నా, దూది నరసింగరావు, కోటరామారావు, సింగంపల్లి రామారావు, ఎన్.ఈశ్వరరావు, కే.లావణ్య, కే.శ్రీనివాస్, అప్పల్ రెడ్డి, జి అప్పారావు, స్వామినాయుడు, దుర్గ భవాని, జగదీష్, విజయలక్ష్మి, దేవి, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను తగ్గిదాం... పర్యావరణాన్ని రక్షిద్దాం..

విశాలాంధ్ర - పెందుర్తి: ఆదర్శ్ డిగ్రి కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 స్పెషల్ క్యాంప్ మూడవ రోజు ద్రోణంరాజు నగర్, చిన్నముషిడివాడలో విజయవంతంగా జరిగిందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.సంధ్య రాణి తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ టి.థియోఫిలస్ ర్యాలీని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో ఆదర్శ్ విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నముషిడివాడ 97వ వార్డు పరిసర ప్రాంతాలలో ద్రోణంరాజు పార్క్ నుండి ర్యాలీ ప్రారంభించి బ్యానర్ అండ్ ప్లకార్డులతో 50 మంది ఎన్ఎస్ఎస్ క్యాంప్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడద్దు, పేపర్ ముద్దు అనే నినాదంతో అవగాహన కల్పిస్తూ, ప్రతి షాపునకు వెళ్ళి విద్యార్థులు పేపర్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్స్ అందజేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిదాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

శంకర్ ఫౌండేషన్ విజనరీ ఇన్‌సైట్స్ వార్తాలేఖకు జాతీయ అవార్డు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న జీవీఎంసీ 93 వ వార్డు నాయుడు తోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆసుపత్రి, కంటి రోగులకోసం నెలవారీ ప్రచురిస్తున్న విజనరీ ఇన్సైట్స్ వార్తాలేఖకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించిందని ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కె.బంగార్రాజు తెలియజేశారు. ఈ నెల 13 రాత్రి డెహ్రాడూన్‌లో జరిగిన 47వ అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సులో శంకర్ ఫౌండేషన్ నెలవారీ వార్తాలేఖ 'విజనరీ ఇన్‌సైట్స్'కు రెండవ బహుమతి లభించగా, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తరపున రాజ్యసభ సభ్యులు నరేష్ బన్సల్ చేతుల మీదుగా ఎడిటర్, శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు ఈ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో శంకర్ ఫౌండేషన్ సమాజానికి అందిస్తున్న సేవలు పట్ల ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే శంకర్ ఫౌండేషన్ వార్తాలేఖను, దానిలోని విషయాలను ఆసక్తిగా గమనించిన ముఖ్యమంత్రి, అవార్డు అందుకున్న బంగార్రాజుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నరేష్ బన్సల్ వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కార్పొరేట్ సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు. పీఆర్ఎస్ఐ జాతీయ చైర్మన్ డాక్టర్ అజిత్ పాఠక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి, ఇతర విశిష్ట ప్రముఖుల సమక్షంలో శంకర్ ఫౌండేషన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకుంది. జాతీయ స్థాయిలో ఈ గుర్తింపును శంకర్ ఫౌండేషన్ వరుసగా రెండవ సారి పొందడం గమనార్హం. శంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఎం.రాందాస్, మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, ట్రస్టీలు ఎ.ప్రసన్న కుమార్, ఎ.విజయ కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్‌లతో కూడిన బృందం ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి గౌరవాన్ని సాధించినందుకు గాను 'విజనరీ ఇన్‌సైట్స్' ఎడిటర్ కె.బంగార్రాజుకు, సంపాదక బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ పురస్కారం నేత్ర వైద్య రంగంలో కమ్యూనికేషన్, ప్రజా అవగాహనలో శ్రేష్ఠత పట్ల శంకర్ ఫౌండేషన్ యొక్క అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతోందని, తద్వారా కంటి సంరక్షణలో విశ్వసనీయమైన స్వరంగా దాని పాత్రను మరింత బలోపేతం చేయనుందని, ఈ విజయం శంకర్ ఫౌండేషన్‌ను కంటి సంరక్షణ నిర్వహణలో జాతీయంగా మరింతగా గుర్తింపు తెచ్చిందని శంకర్ ఫౌండేషన్ ట్రస్టీలు పేర్కొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి హైస్కూలులో 1987 - 88లో పదవ తరగతి చదివిన ఆనాటి విద్యార్థుల ఆత్మీయ సమావేశం దువ్వపాలెం ది వన్ రిసార్ట్స్‌లో ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ సమావేశంలో ఆనాటి మిత్రులు మహా విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మల్ల శ్రీను, రెడ్డి సురేష్, తాటిపాకల భాస్కరరావు, బండారు శ్రీను తదితరులు మిత్ర గ్రూప్ మేరా భారత్ మహాన్ అంటూ పదవ తరగతి ఫ్రెండ్స్ సందడి చేశారు. అందరూ ఆప్యాయంగా పలకరించుకుని ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకొని, ఆప్యాయత అనురాగాలతో వేడుక జరుపుకున్నారు.

కొనసాగుతున్న ఆక్రమణలు తొలగింపు

జీవీఎంసీ పరిధిలో 319 ఆక్రమణల తొలగింపు
- జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్‌రావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో అన్ని జోన్లలో ఆపరేషన్ లంగ్స్ 2.0లో భాగంగా 319 ఆక్రమణలను ఆదివారం తొలగించడం జరిగిందని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్‌రావు ఆదివారం తెలిపారు. మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు సురక్షితంగా ఫుట్ పాతులపై నడక సాగించేందుకు, రోడ్లు, జంక్షన్ల వద్ద వాహనాల రాకపోకలకు అడ్డంకులు లేకుండా సురక్షిత రవాణా కోసమై జీవీఎంసీ ఆపరేషన్ లంగ్స్ 2.0లో భాగంగా అన్ని జోన్లలో రోడ్లపై జంక్షన్లలో ఆక్రమణలు తొలగించడమైనదని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. ప్రజా సౌకర్యార్థమై ఆక్రమణల తొలగింపు కొనసాగిస్తూ ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరిగినదని, ఇప్పటికే నగరంలో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యల దిశగా ఆపరేషన్ లంగ్స్ పనిచేస్తుందన్నారు. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులలో ఎక్కువగా రోడ్లు, ఫుట్ పాత్ ఆక్రమణలు రోడ్ల కిరువైపుల వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల తరచుగా ప్రజల రాకపోకలకు, వాహనాల రవాణాకు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందని, ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడానికి తక్షణ చర్యలు చేపట్టే ఆవశ్యకత దృష్ట్యా జి.వి.యం.సిలో గల 8 జోన్ల పరిధిలో గల ప్రధాన రహదారులలో, జంక్షన్లలో ఉన్న ఆక్రమణలు గుర్తించి వాటిని వెంటనే పోలీసు వారి సహకారము తో శనివారం తొలగించిన 336 ఆక్రమణలతో పాటు మొత్తంగా 655 ఆక్రమణలను తొలగించడమైనదని సిసిపి తెలిపారు.

1వ జోన్‌లోని క్లాక్ టవర్ నుండి తగరపువలస జంక్షన్ వరకు 20 ఆక్రమణలు, జోన్ 2 పరిధిలో ఎండాడ నుండి రుషికొండ 100 అడుగుల రోడ్డు వరకు 60 ఆక్రమణలు, 3వ జోన్ పరిధిలో స్పోర్ట్స్ అరీనా నుండి బిఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ ఎదురు రోడ్డు వరకు, అలాగే మహాలక్ష్మి అపార్ట్మెంట్ నుండి నేషనల్ హైవే శివాజీ పార్క్ రోడ్డు వరకు 42 ఆక్రమణలు, 4 వ జోన్ పరిధిలోని లీలామహల్ జంక్షన్ నుండి సౌత్ జైలు రోడ్డు వరకు 27 ఆక్రమణలు, 5వ జోన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుండి మర్రిపాలెం జంక్షన్ వరకు 34 ఆక్రమణలు, 6వ జోన్ పరిధిలోని శ్రీనగర్ నుండి దుర్గా నగర్ రోడ్డు, బీసీ రోడ్డు జంక్షన్ నుండి గంగవరం పోర్టు రోడ్డు వరకు 53 ఆక్రమణలను, 7వ జోన్ పరిధిలో ఎన్టీఆర్ విగ్రహం నుండి చింతా వారి వీధి వరకు 18 ఆక్రమణలు, 8వ జోన్ పరిధిలోని ఆర్ఆర్ వెంకటాపురం నుండి వేపగుంట వరకు వేపగుంట జంక్షన్ నుండి గోపాలపట్నం జంక్షన్ వరకు అలాగే రైల్వే స్టేషన్ రోడ్డు వరకు 65 ఆక్రమణలు తొలగించడం జరిగిందని ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా జోన్ల కమిషనర్లు ,సహాయక ప్రణాళిక అధికారులు, ప్రణాళిక విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేబీ ఫిట్నెస్ జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డు మహిళా ప్రగతి కేంద్రం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జేబీ ఫిట్నెస్ జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. రిబ్బన్ కత్తిరించి జిమ్మును ప్రారంభించిన ఎమ్మెల్యే రమేష్ బాబు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిమ్‌లోని పరికరాలను పరిశీలించి యువతకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వేగి దివాకర్, డిబిఎల్ నాయుడు, అయితి సింహాచలం, సేనాపతి సోమశేఖర్, బండారు వరూధిని, దాట్ల మధు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, తనకాల శ్రీనివాసులు, పిన్నింటి పార్వతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భవాని జువెలరీస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ చిన్నముసిడివాడ మెయిన్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ భవానీ జువెలరీస్ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి నూతన షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. షోరూంలో ఏర్పాటు చేసిన బంగారు ఆభరణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంతా శంకర్రావు, వార్డు సీనియర్ నాయకులు సేనాపతి శంకర్రావు, వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం, సిహెచ్‌సి డైరెక్టర్ బండారు వరూధిని, సీనియర్ నాయకులు కరక దేముడు, దాట్ల మధు, మహిళా కోఆర్డినేటర్ మంతా నాగసుధ, ఏఎంసి డైరెక్టర్ హైమావతి, 96, 94 వార్డు అధ్యక్షులు డిబిఎల్ నాయుడు, పిన్నింటి పార్వతి, జనసేన పార్టీ నాయకులు ముక్కా సంతోష్, దుంబారి రామారావు, రాపర్తి కిషోర్, బంటు సురేష్, కేశవ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగానికి తగిన గుర్తింపునివ్వాలి

అమరజీవి వర్ధంతి సందర్భంగా మూల వెంకట్రావు

విశాలాంధ్ర - పెందుర్తి: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి తగిన గుర్తింపుని ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిజెపి బీసీ నేత మూల వెంకటరావు పేర్కొన్నారు. డిసెంబర్ 15 పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమరజీవి మరణం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మాత్రమే కాకుండా, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి దోహదం చేసిందని తెలిపారు. నిత్యం ఏదో ఒక ప్రజాసమస్యపై పోరు తలపెట్టే ఆయన పెద్ద సైనిక పటాలంతో సమానం అని, పొట్టి శ్రీరాములు వంటి యోధులు 20 మంది ఉంటే ఒక్క ఏడాదిలోనే దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధిస్తానని ఒకానొక సందర్భంలో మహాత్మా గాంధీ వ్యాఖ్యానించారన్నారు. దళితులు దేవాలయ ప్రవేశం కొరకు యెడతెగని సమరం చేసి ఫలితం సాధించారని, అస్పృశ్యత నిర్మూలన కొరకు కూడా అహో రాత్రిళ్లు యుద్ధమే చేసారన్నారు. మితిమీరిన మదరాసీల ఆగడాలతో అవమాన పాలవుతూ, అణచివేతకు గురవుతున్న తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ఆశించి 1952న డిసెంబరు 15 న ప్రాణాన్ని బలి దానం ఇచ్చారని గుర్తు చేసారు. శ్రీరాములు ఆత్మత్యాగంతో, రగిలిన ప్రజాగ్రహంతో నాటి ప్రధాని నెహ్రూ కళ్ళు తెరిచారన్నారు. ప్రాణం అముల్యమైనది, ప్రాణత్యాగం మహోన్నతమైనది. ఇక మనిషి ఇంతకుమించి చేయదగిన అర్పన మరొకటేముంటుందని పేర్కొన్నారు. తన అవసరాలకు కాకుండా, ప్రజల సౌభాగ్యం కోరి తనను తాను బలి పెట్టుకున్న అమర జీవి పట్ల హృదయం పట్టనంత కృతజ్ఞత చూపడం ఆంధ్ర రాష్ట్ర వాసులుగా మనందరి విధి అన్నారు. ఆయన విగ్రహానికి పూలదండలు వేసి సరిపుచ్చే మొక్కుబడి కార్యక్రమాలనుంచి వెలుపలికి రావాలని, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఆయన జయంతిగా మార్చి 16న గాని, వర్ధంతి డిసెంబరు 15న గాని జరపడం ఉత్తమంగా ఉంటుం దన్నారు. ఆయన జయింతి నాడు అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలకు శలవులు ప్రకటించడం ద్వారా, శలవుల ప్రాధాన్యత, శ్రీరాములు బలిదానాన్ని గుర్తుకు తేవాలి. ప్రాధమిక, మాధ్యమిక పాఠశాలలు, కళాశాల విద్యలో అమరజీవి జీవిత విశేషాలు, పోరాటాలు, ప్రాణదానంపై ఒక పాఠ్యాంశాన్ని విదిగా ఉంచాలన్నారు. వర్ధంతి రోజున అన్ని రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోను, విద్యా సంస్థల్లోను అధికారికంగా నివాళులు అర్పించి, అంజలి ఘటించే కార్యక్రమాలు చట్టబద్ధం చేయాలన్నారు. ఆయన ముఖ చిత్రంతో ఒక నాణాన్ని విడుదల చేసే విదంగా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపాలని మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి: కైతపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి సన్ స్కూల్ వేదికగా భీమిలి సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విశాఖ బ్లడ్ సెంటర్ వారి సౌజన్యంతో 26వ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బిఎన్‌డబ్ల్యు అధ్యక్షులు కైతపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉండుట వలన, ఈ కొరతను భర్తీ చేయడానికి బిఎన్‌డబ్ల్యు అసోసియేషన్ ఆధ్వర్యంలో తరచు ఈ విధంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో కైతపల్లి శ్రీనివాస్‌తో పాటు బీఎండబ్ల్యూ సభ్యులు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ఓఎస్‌జి ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేయడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో 79 మంది దాతలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో డిసిఆర్ కుటుంబ సభ్యులంతా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

అంతేకాకుండా బీఎండబ్ల్యూ సభ్యులంతా కలిసి రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అభినందించారు. అదేవిధంగా రక్తదానం చేసిన దాతలందరికీ బ్లిస్ క్యాటరింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ లావణ్య ప్రత్యేకమైన బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సన్ స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తమ పూర్తి సహాయ సహకారాలను అందించారు. కార్యక్రమంలో బిఎండబ్ల్యూ సభ్యులు డాక్టర్.ఎన్.ఎల్.రావు, గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, ముసునూరి సూర్య శ్రీనివాస్, కాళ్ళ సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, వెంపాడ శ్రీనివాస్ రెడ్డి, శివ దాలయ్య, ఎస్.రమణ ప్రసాద్, అడిదం కిషోర్, కోరాడ నరసింహులు, తమ్మిన సూరిబాబు, నీలాపు శంకర్ రెడ్డి, విశాఖ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేష్మ, డి.రామ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.